## ౧౧

# బురద నీరు

ఆ రోజు వర్షం పడి వెలిసింది. ఊళ్ళో పెద్దలూ, పిన్నలూ అంతా రచ్చరాయి మీదికి చేరేరు. అందులో నలుగురు డబ్బులేసి పేకాటాడుతూంటే తక్కినవాళ్ళు చూస్తూ సలహా లిస్తూ ఆనందిస్తున్నారు. మాంతివీధి అప్పలనాయుడు మీసాలు పెనవేసుకుంటూ రాయిదగ్గరకు వచ్చేడు. అప్పలనాయుడికి ఊళ్ళో మంచి గౌరవం ఉంది. ఊరుకి మునసబు. డబ్బులేక పోయినా మంచి తెలివైన వాడని ప్రసిద్ధి. గొప్ప వ్యవహార వేత్త. తను ఊళ్ళో ఎవరి కేసు పట్టుకు వెళ్ళినా జయంతప్పదు. చదువు రాకపోయినా, తనలాగ ఏ ప్లీడరూ సలహా లివ్వలేడు. ప్లీడర్లతోనూ, మేస్ట్రేటులతోనూ మాట్లాడాలన్నా, కోర్టుకి సాక్షుల్ని జత పెట్టాలన్నా, పోలీసు వాళ్ళతో వ్యవహారాలు చక్కబెట్టాలన్నా అతని సహాయం లేనిది ఏమీ జరగదు. ఊళ్ళో చదువుకున్న కరణంకూడా అతని దగ్గర పనికిరాడు.

అప్పలనాయుడిని చూడగానే తమ్మన్న తాత లేచి దండం పెట్టేడు. తమ్మన్న తాత ముసలివాడు కాడు. యువకుడూ కాడు. ఓ నలభై ఏళ్ళుంటాయి—మోతుబరి రైతు—మంచివాడు— ఓహాని జోలికి వెళ్ళడు. అంచేత అతడంటే ఆ వూళ్ళో గౌరవం ఉంది.

అప్పలనాయుడు నమస్కారం అందుకుని, "ఏం తాతా ఏటి సమాచారం, మీ పొలం ఉభా అయిందేటి?"

"ఆ—అయింది మామా కాని బాబులు దిగొచ్చి నారు" అన్నాడు తిమ్మన్న.

"ఏం?"

"ఈ కూలోళ్ళతో పడలేకపోతున్నాం మామా—మొగోడికి రెండు రూపాయలు ఆడదానికి రూపాయి. బాగా సల్దికూడేలకి దిగబడి పొద్దు గూకకముందే పనొగ్గేస్తారు—ఏటి బరించడం సెప్పు?"

"నీకేటి, మారాజువి—"

"నీరు సమంగా నేదుగదా; నీరుంటే పోనీ, నువ్వన్న మాటే—"

"తాతా, నీరంటే యాదస్తాచ్చింది. ఈ యీదిలోంచి పోతూన్న మురగటినీరు ఎవరి పొలంలోకి ఎల్తాందిరా?"

వీధిలోంచి మురగటినీరు తాచుపాములా పారుతోంది. అందులో సాయంత్రపు అరుణకాంతులు పడుతూ మసిబారిన చిమ్నీలా మెరుస్తూంది.

అప్పలనాయుడికి తెలుసు ఈ నీరు గంటెప్పడి పొలానికి పోతుందని, గంటెప్పకు కూడా మోతుబరే. కాని మోతుబరి రైతుల్లోకల్లా ఇంతవరకూ దావాల్లోకీ తంటాల్లోకీ, దిగకుండా కాలక్షేపం చేస్తున్న వాళ్ళు గంటెప్పదూ, తమ్మన్న తాతే. అంచేతే అప్పలనాయుడికి వీళ్ళను చూస్తే కన్నెర్ర.

"ఒరే తాతా, ఈ నీరు నీయింటి పక్కనుంచేగదరా పోతాది—నీ మిరపతోటల్లో కెట్టరా—" అని సలహా ఇచ్చేడు అప్పలనాయుడు.

"తప్పు మామా, మనకెందుకా నిష్ఠూరం—తొలి కాడినించి ఆడిదే ఈ నీరు—"

"ఆడిదా నీరు—ఆడి బాబు గడించేడేట్రా? ఈదిలో పారే నీరు ఒకడిదేట్రా—అందరిదీన్ని. ఒరే! నన్నాకరికీ ఎవ్వారగ్యానం లేనోడికింద కట్టేసినావు—"

తమ్మన్నకి ఆశ కలిగింది. మురగటినీరు మంచి సత్తుయింది—ఆ నీరు పెడితే మిరపతోట ఇప్పటికంటే నాలుగురెట్లు కాస్తుంది. కాని ఎలాగ?

"భయమేటిరా, పదేశ్, నేనున్నా—" అప్పలనాయుడు తమ్మన్న చెయ్యిపట్టుకుని ఈడ్చుకెళ్ళేడు. వీధిలోంచి పారే నీటికి కాలితో మన్నుతోసి మిరపతోటకి చిన్న కాలవ చేసేడు. నీరు దగ్గరగా ఉన్న మిరపతోటలోకి పరుగెత్తింది.

అప్పలనాయుడు తన ప్రజ్ఞకి తనలో తను సంతృప్తి పడ్డాడు. తను వేసిన పాచిక బాగానే పారింది. తమ్మన్న బుట్టలో పడ్డాడు. ఇంక గంటెప్పుడు కూడా పడాలి. ఈదిలో వాడెంతసేపు! తన శిష్యులలో ఎవడినేనా ఒకడిని పంపి వాడిని రెచ్చగొట్టించగలడు.

బాగా చీకటి పడింది. తమ్మన్న తాత ఇంటికొచ్చి గుమ్మంలో చూరుకింద కూర్చుని ఆలోచిస్తూన్నాడు. సంవత్సరానికి పాతిక రూపాయ లొచ్చే మిరపతోట తన కెన్నో ఆశలు కలిగించింది—ఆ మురగడి నీరుగాని పారితే, ఆ తోట ఇంక ఎంతైనా కాస్తుంది. నాలుగేళ్ళాగుకుంటే ఆ తోటమీద వొచ్చే దానివల్ల ఒక చిన్న పెంకుటిల్లు లేవదియ్యొచ్చు. మరో నాలుగెకరాలు కొని చిన్న మామిడితోట వేశాడంటే ఇంక తనవెనకాల ఎంతమంది తిరుగుతారు! గంటెప్పటి

పెంకుటిల్లూ, మామిడితోటా ఉన్నాయి. వాడి బంగారపు కడియం, సిలుకులాల్చీ, అబ్బో—వాడిని చూడగలమా?

భార్య గురివి కిరసనాయిలు బుడ్డి వెలిగించి లోపలికి వచ్చింది.

"ఏటిక్కడ కూకున్నావు—సీకటి"—బుడ్డి నేలపెట్టి నిలబడేసరికి, చూరు గురివిబుర్రకి తగిలింది.

"దీని జిమ్మడ—అబ్బ—"

"గట్టిగా తగిలిందేటి—"

"నేదు నే—"

"గురివీ! పెంకుటిల్లు కట్టిద్దామని ఎంతకాలమయో మనసుంది కాని డబ్బుతో పని"—

"ఓలమ్మో - ఏటాశ - పెంకుటిల్లంటే మజాకాలేటి-పోనిద్దూ, భగవంతుడిచ్చింతే అంతే - నెగు, గంజితాగుదు గాని—"

వీథిలో అడుగుల చప్పుడయింది. ఏమిటో అని లేచాడు తమ్మన్న.

"ఒరేయి తమ్మన్నా, ఇలా రారా—" వీథిలో గంటెప్పుడు ఓ పదిమందిని తీసుకుని వచ్చేడు.

"నీ బాబుగాడి సొమ్మేటిరా, ఆనీరు, నీ మిరపతోటలో కట్టేశావు—"

"ఛా ఫో న్ . . . నీ బాబు దేటి వరసపునీరు . . ."

వచ్చిన పెదమనుషులందరూ తలోకరీతి తీర్పు చెప్పేరు. కాని తగువు పెద్దదయి, కొట్టుకున్నంతవరకూ వచ్చింది. గంటెప్పుడి పెళ్ళాం నోరు విప్పిందంటే మూడు లోకాలూ

హాడలు కొట్టిస్తుంది. తమ్మన్న పెళ్ళాం మాత్రం తక్కువదా— అదీ తిట్టింది పౌరుషం, పరాక్రమం రెండువేపులా బాగా కనబరచారు. రాత్రి ఎవరి మానాన్ని వారు వెళ్ళిపోయారు.

కాని అప్పలనాయుడు రెండువేపులా ఉసిగొలిపేడు. కోర్టులో దావాలు పడ్డాయి. తమ్మన్న అప్పలనాయుడి దన్ను మీద మీసం మెలివేశాడు. గంటెప్పుడు అప్పలనాయుడి శిష్యుడి దన్నుమీద లేచి నిలబడ్డాడు. రకరకాల సాక్ష్యాలు. ఫీజులు, లంచాలు, కర్చులు... అన్నీ ఓ వెయ్యిరూపాయల వరకూ ఒదిలిపోయాయి తమ్మన్నకి. కాని కేసుపోయింది.

తమ్మన్న మొహం వేలేసి, ఇంటి గుమ్మంలో కూర్చున్నాడు...అప్పలనాయుడు వచ్చి ఓదార్చేడు.

"మామా, కోర్టెక్కినోడూ, గాడిదెక్కినోడూ ఒకటే నట—ఊరికేనే సెప్పినారేటి సాస్త్రం..." అన్నాడు తమ్మన్న.

"తాతా, ఇంతట్లోకే బేజారెత్తిపోతే ఎలాగెల్తాయి ఎవ్వారాలు...మనం గెలిసి తీరుతాం".

"ఇంక గెలిసేదేమిటి...పేడా పిడకలు..."

"ఏటి, దీన్తోటి సరేటి... ఈడ కాకపోతే ఈడి బాబు ఇంకోడు. జిల్లాకోరటులో ఈ ఏసాలు సాగవురోయ్...అంతా న్యాయమే. భగమంతుడున్నాడ్రోయ్ తాతా..."

"ఏటి నెద్దూ సినబాబూ, ఈ కాలంలో నాయమేటి?" అన్నది గురివి. మళ్ళీ కోర్టెక్కితే తన వొంటిమీదున్న ఆ వొక్క నానూ ఎగిరిపోతుంది...

ఇది జూదం లాంటిది... ఓడిపోతున్న కొద్దీ పౌరుషం ఎక్కువవుతుంది.

"ఛీ...మీ కసలు పౌరుషం లేదేస్... మీతోటి నాకేటి? ఎలమోడివికావురా? చిగ్గునేదూ? గంటెప్పడు అలా ఛాతీ ఇరుచుకు తిరుగుతూంటే..."

తమ్మన్నలో దాగి ఉన్న వెలమ పౌరుషం అంతా ఒక్కసారి సముద్రకెరటంలా తోసుకొచ్చింది. మీసాలు మెలి వేసి "సరే, పద మావా, దీని అంతేటో సూదాం..." అంటూ లేచాడు.

మళ్ళీ ఈసారి న్యాయం కోసం జిల్లా కోర్టుకి వెళ్ళేరు. ప్లీడరు బాగా ధైర్యం చెప్పేడు... అయినా ప్లీడరు రంగా రావుకూడా మహా గట్టివాడు. ప్లీడరువరకూ ఎందుకు, అతడి గుమాస్తా నరసయ్య .అబ్బో! అసాధ్యుడు. అతడు ప్లీడరుగారికే సలహాలు ఇస్తూంటాడు. కోర్టుచుట్టూ తిరగ్గా తిరగ్గా, లంచాలు, సాక్ష్యాలు, మజిలబులు అన్నీ అవగా, తీర్పు అయింది. బురద నీటి కేసు చాల పెద్ద ప్రసిద్ధమయిన కేసయింది. తీర్పయేసరికి చాల కాలం పట్టింది. తమ్మన్నకు ఈసారో వెయ్యిరూపాయి లొదిలిపోయాయి—కేసు మాత్రం పోలేదు. కాని గెలవా లేదు. బురదనీటి హక్కు ఊరందరికీ ఉందనీ, అందరూ ఉప యోగించుకోవచ్చుననీ, గంటెప్ప డొక్కడే ఉపయోగించుకో వచ్చుననీ, గంటెప్ప డొక్కడే ఉపయోగించుకో కూడదనీ, కాబట్టి ఇప్పుడు అందరికీ ఉపయోగంగా ఉండేటట్టు ఆ నీరు ఊరి చెరువులోకి వెళ్ళాలనీ కోర్టువారు తీర్పుచెప్పేరు. తీర్పుకి ఊళ్ళో అంతా సంతోషించారు.

తమ్మన్నకి రెండువేలు వొదిలిపోయాయి—ఆ విచారం ఉన్నా, వెలమ పౌరుషం చూపించానన్న సంతృప్తి ఉంది.

"రామిగాడి సాచ్చికం పాడయింది, నేకపోతేనా—ఆ నీరు మన మిరపతోటలో కొచ్చేదే" అన్నాడు పెళ్ళాంతో. పోయిన డబ్బు పోతేపోయిందిగాని కోర్టుఖర్చులు బాగా తెలిశాయి తమ్మన్నకి. కేసు గురించి పెళ్ళాం దగ్గర డాబులు కొట్టేడు.

సాల్నెద్దూ—కడుపులోనికూడరక్క— కోరుటులెక్కినాం— నాగుజోడు, తీగె, నాను, మడిసెక్కా— అన్నీ ఎల్లిపోనాయి— ఏటో, కరమం—"

అంటూ ఏడిచింది గురివి.

ఆరిపోయిన చుట్ట గుమ్మం వోడ్డున పెట్టి, ఆవలిస్తూ నులకమంచం మీద నడుంవాల్చాడు. గురివి నేల మీద గోనెపరుచుకుని పడుకుంది. తమ్మన్న పూరిల్లుకూడా వాళ్ళతోటే నిద్రపోయింది.

కాని దూరాన్న చీకట్లో అప్పలనాయుడు కొత్తగా కట్టిన డాబా తెల్లగా కనిపిస్తోంది.